

మండలంలో పత్తి పంటను సాగు చేసిన రైతులు

## జాగ్రత్తలు పాటిస్తే..
# పత్తి బంగారమే..
## పత్తి తీసేటప్పుడు తొందరపాటు తగదు

- తేమ శాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలి
- ప్రస్తుతం మంచు కురుస్తున్న నేపథ్యంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల్లోపు పత్తిని తీయాలి
- చేవెళ్ల మండలంలో పెరిగిన పత్తి సాగు
- ఈ ఏడాది 10,594 ఎకరాలకుపైగా..
- సలహాలు, సూచనలు పాటించాలంటున్న వ్యవసాయ శాఖ అధికారులు

చేవెళ్లటౌన్, డిసెంబర్ 21 : మండలంలో ఏటేటా పత్తి సాగు గణనీయంగా పెరుగుతున్నది. గతేడాదితో పోల్చితే ఈసారి ఈ పంట సాగు బాగా పెరిగింది. ఈ ఏడాది 10,594 ఎకరాలకు పైగా పంటను రైతులు సాగు చేశారు. పత్తిని తీయడంలో జాగ్రత్తలు పాటిస్తే పత్తి బంగారంగా మారుతుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వాతావరణం అనుకూలించక, అతివృష్టి, అనావృష్టితో ఇతర పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. దీంతో మండలంలోని చాలా మంది రైతులు పత్తి పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. అయితే పత్తిని తీసే సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో మార్కెట్లో మద్దతు ధరను కోల్పోయే ప్రమాదం ఉన్నది.

### పత్తి సాగులో జాగ్రత్తలు ..

ఎరువు వేసేముందు చేనులో కలుపు తీయాలి. మూడు, నాలుగు ఆకుల దశలో కలుపు ఉంటే ఎకరానికి 400 మిల్లీ లీటర్ల క్విజలోపాప్ ఈథైల్ (టర్గాసూపర్)+250 లీఫైరిథియోబాగ్ సోడియం (హిట్‌బీడ్) కలిపి పిచికారీ చేయాలి. వరుస మొక్కల దగ్గర ఉన్న కలుపును కూలీలతో తీయించాలి. ఎండు తెగులు ఆశించిన మొక్క వేరును నిలువుగా చీల్చి చూ స్తే లోపల ఎర్రటి చారలు కనిపిస్తే పంటకు ఎండు తెగులు ఆశించినట్లు భావించాలి. తొలి దశలో ఎర్రటి చారలు కనిపించకపోవచ్చు. వాడిపోయినట్లు కనిపించగానే నివారణ చర్యలు తీసుకోవాలి. పత్తి పంట రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తామెర పురుగులు ఆశిస్తే వాటి నియంత్రణకు కాండం పూత పద్ధతిలో ఒకసారి మోనోక్రోటోఫాస్‌ను నీటిలో కలిపి మొక్క కాండంపై ..మధ్య భాగంలో రెండు అంగుళాల పొడవునా ఒకవైపు మాత్రమే పూయాలి. కాండంపై సులభంగా పూసేందుకు చిన్న పరికరాన్ని లేదా బ్రష్‌ను ఉపయోగించాలి.

### పంట చేతికొచ్చాక ..

పత్తి బాగా విప్పుకున్న కాయ నుంచి మాత్రమే పత్తిని తీయాలి. కొద్దిగా విప్పిన కాయ నుంచి పత్తి తీయకూడదు. పత్తి తీసే సమయంలో ఆకులు చేతికి అంటకుండా జాగ్రత్తలు పాటించాలి. తీసిన పత్తిని నీడలో ఆరబెట్టి గాలి తగిలేలా నిల్వ చేయాలి. తేమ తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుత సమయంలో మంచు ఎక్కువగా కురుస్తుండడంతో మంచు తగ్గిన తర్వాత అంటే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల్లోపు పత్తిని తీయాలి. ఎక్కువ వేడి ఉన్నప్పుడు పత్తిని తీస్తే గుల్లల వద్ద తొడిమెలు, ఆకులు పత్తికి అంటుకుంటాయి. పత్తిని తీసిన వెంటనే నీడలో వేయాలి. ఇలా చేస్తే తేమ తగ్గి పత్తి నాణ్యతగా ఉంటుంది. నీడలో కుప్పగా వేస్తే పత్తిలో ఉన్న తేమ, వేడి ఎక్కువై గింజలు ముడతపడి తూకంలో బరువు తగ్గడమే కాకుండా ముక్కపురుగు తగిలి నాణ్యత కూడా దెబ్బతింటుంది. రైతులు పత్తి పంటను సాగు చేసే సమయంలో ఎంత జాగ్రత్తగా ఉంటారో తీసే సమయంలోనూ అంతే జాగ్రత్తగా ఉండాలి. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే పత్తి తేమ తగ్గి విక్రయించే సమయంలో నూ నాణ్యతగా ఉండి అధిక ధర వచ్చే అవకాశం ఉంటుంది.





పత్తిని తీయడంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారిణి తులసి

### విప్పిన ఆరు రోజుల తర్వాత పత్తిని తీయాలి


రైతులు పత్తి పంటను సాగు చేసే సమయంలో ఎంత జాగ్రత్తగా ఉంటారో తీసే సమయంలోనూ అంతే జాగ్రత్తగా ఉండాలి. ప్రస్తుత సమయంలో మంచు అధికంగా కురుస్తుండడంతో మంచు తగ్గిన తర్వాత పత్తిని తీయాలి. వేడి అధికంగా ఉన్నప్పుడు పత్తిని తీస్తే వెంటనే నీడలో వేయాలి. ఇలా చేస్తే తేమ తగ్గి పత్తి నాణ్యతగా ఉంటుంది. పత్తి విప్పిన 5 నుంచి 6 రోజులో పత్తిని తీయాలి. లేకపోతే తేమ ఎక్కువై సూటిమోల్డ్ వచ్చే అవకాశం ఉన్నది. రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలి.

-రమాదేవి, చేవెళ్ల ఏడీఏ



## ఉద్యోగుల నిలయం
# పటేల్‌చెర్వుతండా

- చిన్నతండా అయినా పోలీసు ఉద్యోగాలకు పెట్టింది పేరు
- 70మందికి పైగా సర్కారు ఉద్యోగులే



మంచాల మండలంలోని పటేల్‌చెర్వుతండా వ్యూ

మంచాల, డిసెంబర్ 21 : రంగారెడ్డి జిల్లాలోనే మారుమూల తండా అయిన పటేల్‌చెర్వు తండాకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఇక్కడ ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం.. పట్టుదలతో చదువుతారు. 70 మందికిపైగా డాక్టర్లు, తహసీల్దార్, పోలీసులు, ఆర్టీసీ తదితర ప్రభుత్వ విభాగాల్లో స్థిరపడ్డారు. పటేల్‌చెర్వుతండా బంజారా సంస్కృతీ సంప్రదాయాలకు మారుపేరుగా నిలిచింది. 1011 జనాభా ఉండగా.. 900 మంది ఓటర్లు, 400 కుటుంబాలున్నాయి. ఇక్కడి గిరిజనులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. తండాలో ఎక్కువ శాతం ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఉండే నేడు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. ఉద్యోగం సాధించిన వారు తండాను మరిచిపోకుండా వారు సంపాదించిన దాంట్లో తండాలోని పిల్లల చదువుకోసం ఖర్చు చేస్తూ తమ అభిమానాన్ని చాటు కుంటున్నారు. తండా చిన్నదైనా ప్రభుత్వ ఉద్యో గాలను సాధించడంలో ముందున్నది. యువతీ యువకులు ప్రభుత్వ కొలువులు కొట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతారు. ఇక్కడ ఒక్కో ఇంట్లో ఇద్దరు ముగ్గురు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారు ఉన్నారు.

### ప్రభుత్వ ఉద్యోగాల్లో పని చేస్తున్న వారు..

కానిస్టేబుళ్లు -46 మంది, ఏఎస్ఐలు-నలుగురు, ప్రభుత్వ ఉపాధ్యాయు లు ఐదుగురు, డాక్టర్లు ముగ్గురు, ఆర్టీసీలో నలుగురు, తహసీల్దార్‌లో ఒకరు, ఎస్టీవోలో ఒకరు తమ విధులను నిర్వహిస్తున్నారు.



### ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూనే..

హైదరాబాద్ నగరంలో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూనే రాత్రి, ఖాళీ సమయాల్లో ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలనే పట్టుదలతో చదివా. చిన్నప్పటి నుంచే పోలీస్ కావాలని లక్ష్యంగా ఉండేది. దీంతో ప్రతిరోజూ ఖాళీ సమయంలో కష్టపడి చదివి కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించా. కానిస్టేబుల్ నుంచి ప్రస్తుతం ఏఎస్ఐగా పదోన్నతి సాధించా. ప్రతి ఒక్కరూ లక్ష్యం తో ముందుకు సాగితే అన్నకున్నదానిని కచ్చితంగా సాధిస్తారు.

మోత్యానాయక్, ఏఎస్ఐ

### కష్టపడి చదివి ఉద్యోగం సాధించా..

కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించా. పదో తరగతి వరకు ఇబ్రహీంపట్నంలో ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదువగా.. ఇంటర్‌ను ఇబ్రహీంపట్నం జూనియర్ కళాశాలలో పూర్తి చేశా. కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడుదల కాగానే కష్టపడి చదివి కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించా. తల్లిదండ్రుల ప్రోత్సాహాన్ని మరువలేను.

-శంకర్‌నాయక్, ఏఎస్ఐ





### చదువుకునేలా ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తున్నాం

ప్రటేల్‌చెర్వు తండాలో ఉన్న ప్రతి చిన్నారినీ ప్రభుత్వ పాఠశాలకెళ్లి చదువుకునేలా ప్రోత్సహిస్తున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయడంతో యువతీయువకులు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో చదివి జాబ్‌లను సాధించారు. తండాలో దాదాపుగా 70 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగాల్లో పనిచేస్తుండడంతో చాలా మంది వారిని ఆదర్శంగా తీసుకుని కష్టపడి చదువుతున్నారు. విద్య మనిషిని ఉన్నత శిఖరాలను చేరుస్తుంది.

- రాజూనాయక్, సర్పంచ్ పటేల్‌చెర్వు తండా



ధ్యాన మహాసభలో పాల్గొన్న ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లు

## మహేశ్వర మహా పిరమిడ్‌తో
# ప్రపంచవ్యాప్త గుర్తింపు

- పిరమిడ్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి
- 'పత్రీజీ ధ్యాన మహాయాగం'ను ప్రారంభించిన పత్రీజీ కుటుంబ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు
- తరలి వచ్చిన పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు

కడ్తాల్, డిసెంబర్ 21 : మహేశ్వర మహా పిరమిడ్‌తో ఈ ప్రాంతానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని.. సుభాష్ పత్రీజీ కలలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిరమిడ్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో గల కైలాసాపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో గురువారం సాయంత్రం పత్రీజీ ధ్యాన మహాయాగం-2 ధ్యాన మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పదకొండు రోజులపాటు జరుగనున్న ధ్యాన మహాయాగం సభలను పత్రీజీ కుమార్తెలు పరిమళ, పరిణీతతో కలిసి పిరమిడ్ ట్రస్టు సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సుభాష్ పత్రీజీ ధ్యాన గురువని, ఆయన చూపిన ధ్యాన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. అన్మాస్‌పల్లి గ్రామంలో నిర్మించిన మహా పిరమిడ్‌తో ఈ ప్రాంతానికి ఎంతో గుర్తింపు లభించిందని.. సుభాష్ పత్రీజీ ధ్యానాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించారన్నారు. సుభాష్ పత్రీజీ భౌతికంగా దూరమైన ఆయన అందించిన ధ్యాన్యం మరవలేనిదని తెలిపారు. ధ్యాన మహాసభలకు వివిధ ప్రాంతాల నుంచి పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు హాజరయ్యారు. పిరమిడ్ ధ్యాన సభల ప్రారంభోత్సవం సందర్భంగా కళాకారుల నృత్యాలు విశేషంగా అలరించాయి. అంతకుముందు పత్రీజీ శక్తిస్థల్‌ను ట్రస్టు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్టు సభ్యులు సాంబశివరావు, దామోదర్‌రెడ్డి, రాంబాబు, హనుమంతురాజు, శివప్రసాద్, కృష్ణారెడ్డి, రాజశేఖర్, చంద్రశేఖర్, మాధవి, లక్ష్మి, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, అన్మాస్‌పల్లి సర్పంచ్ శంకర్, ధ్యానులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ధ్యాన మహాయాగం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి



కైలాసాపురిలోని మహేశ్వర మహా పిరమిడ్